సమైక్యతకు నిలయం

- ఉమ్మడి కుటుంబాన్ని తలపిస్తున్న ఏసియన్ టవర్స్
- భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ పండుగలు
- సంక్రాంతి సంబరాల్లో 100 కుటుంబాలు
- ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



మంచిర్యాలటౌన్: ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్న ఆధునిక యుగంలో అపార్ట్‌మెంట్లు ఆత్మీయ అనురాగాలను పంచుతున్నాయి. ప్రతి వ్యక్తి జీవితంలో స్థిర నివాసం అనేది ఓ స్వప్నం. అలాంటిది అపార్ట్‌మెంట్‌లో జీవితం మధురానుభూతి. ప్రత్యేకంగా నిర్మించుకున్న ఇళ్ల కన్నా అపార్ట్‌మెంట్లు మిన్నా అంటున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలోని 120కుటుంబాలు నివాసం ఉంటున్న ఏసియన్ టవర్స్ వాసులు. ప్రతి పండగను ఎంతో వైభవంగా జరుపుకునే వీరు వినాయక చవితి, బతుకమ్మ, దసరా, దీపావళి, శ్రీకృష్ణాష్టమి, క్రిస్మస్, సంక్రాంతి పండుగలను, వివాహాది శుభకార్యాలు, జన్మదిన వేడుకలను ఉమ్మడి కుటుంబాన్ని తలపిస్తూ అందరూ కలిసి చేసుకుంటారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు అంతా కలిసి పిండి వంటలు చేసుకోవడంతో మొదలై, ముగ్గుల పోటీలను గత పన్నెండేళ్లుగా నిర్వహించుకుంటున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అంతా కలిసి ముగ్గుల పోటీల్లో పాల్గొనడం, వారికి అపార్టుమెంట్ అసోసియేషన్ వారు బహుమతులు ఇచ్చి, ప్రోత్సహించడం వంటివి ఏటా జరుగుతుంటాయి. కరోనా కాలంలోనూ ఒకరికి ఒకరు సాయంగా ఉంటూ, ఒకే కుటుంబం అనే చందంగా వారు వ్యవహరించిన తీరు ఇతరులకు ఆదర్శం. భిన్నత్వంలో ఏకత్వంగా అపార్టుమెంట్లలోని వారు కలిసి జీవిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారస్తులు, చిరు ఉద్యోగులు ఇలా అందరూ కలిసి ఆయా అపార్టుమెంట్లలో నివసిస్తున్నారు. ఈ సంక్రాంతినీ ముగ్గుల పోటీలతో ఘనంగా నిర్వహించుకున్నారు.

ముగ్గులు వేయడం ఎంతో ఆసక్తి

ఏసియన్ టవర్స్‌లో ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. ఎవరి ఇంటి ముందు వారు కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి సంక్రాంతి ముగిసే వరకు రంగురంగుల ముగ్గులు వేస్తుంటాం. పండుగకు ముందు ప్రతిసారి ముగ్గుల పోటీలు నిర్వహించుకోవడం, అంతా కలిసి ముగ్గులు వేస్తుంటాం.

– యు. సహన, గృహిణి

అంతా కలిసి జరుపుకుంటాం

ఒక కుటుంబంలో అంతా కలిసి ఉన్నట్లుగా, మా అపార్టుమెంట్లలోని వారంతా కలిసి పండుగలను ఎంతో ఆనందంగా కలిసి జరుపుకుంటాం. సంక్రాంతి పండుగకు ముగ్గుల పోటీలు నిర్వహించుకోవడం, ఒకరి ముగ్గు కంటే మరొకరి ముగ్గు అందంగా ఉండేలా పోటీ పడతాం.

– ఈ. మణి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

సంస్కృతిని తెలిపేలా..



అన్ని పండుగలను అందరం కలిసి జరుపుకుంటాం. మన పండుగల విశిష్టతలు, సంస్కృతిని చిన్నారులకు అర్థం చేసేలా అంతా కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉంటుంది. పిండి వంటలతో పాటు, ముగ్గుల పోటీల్లో పాల్గొనడం, అందులో బహుమతులను సాధించడంలో ఆనందం ఉంది. ప్రతి ఏటా మొదటి, రెండవ, మూడో బహుమతుల్లో ఏదో ఒకటి సాధించడం ఆనందంగా ఉంది.

– ఏ. రాజశ్రీ, గృహిణి, ఏసియన్ టవర్స్, మంచిర్యాల

ఐదేళ్ల నుంచి కలిసే పండుగ...



ఐదేళ్లుగా ఏసియన్ టవర్స్‌లో మేము ఉంటున్నాం. వచ్చినప్పటి నుంచి మేమంతా కలిసే పండుగలన్నింటిని ఘనంగా జరుపుకుంటున్నాం. ఏటా సంక్రాంతి పండుగకు ముగ్గుల పోటీలు నిర్వహించడం, ఇప్పటి చిన్నారులకు ముగ్గులతో పాటు, పండుగల విశిష్టతను తెలిపేలా జరుపుకోవడం జరుగుతోంది.

– సుభాషిని, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

కలిసి ఉండడం ఆరోగ్యకరం



పండుగలను కుటుంబ సభ్యులందరితో కలిసి జరుపుకుంటాం. కుటుంబ సభ్యులతో పాటు, స్థానికంగా ఉండే వారందరితో కలిసి జరుపుకోవడం ఆరోగ్యదాయకం. అందరితో కలిసి పండుగల్లో పాల్గొనడం, ముగ్గుల్లో పోటీపడడం, పిండి వంటలను కలిసి చేసుకోవడం ఇవన్నీ కూడా మనస్సుకు ఎంతో ప్రశాంతతను ఇస్తాయి. – పుష్పలత, గృహిణి

ఆనందాలు నింపేలా..



సంక్రాంతి పండుగ అంటేనే అందరి ఇళ్లల్లో ఆనందాలను నింపేది. కొత్తగా చేతికొచ్చిన పంటలు, వాటితో తయారు చేసుకునే పిండి వంటలే కాదు, ఆడవారు ఇంటి ముందు వేసే అందమైన ముగ్గులు కూడా. ఏటా మా అపార్టుమెంట్‌వాసులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తే, ఖచ్చితంగా అందులో బహుమతిని పొందుతుండడం ఆనందంగా ఉంటుంది.– పి. శిల్ప, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

ఆకట్టుకునే ముగ్గులు వేయడం ఇష్టం



చిన్నప్పటి నుంచి ముగ్గులు వేయడం ఎంతో ఆసక్తి. ముగ్గుల పోటీలను మా ఏసియన్ టవర్స్‌లో ఏటా నిర్వహిస్తారు. ఈ పండుగ సమయంలో నిర్వహించే ముగ్గుల పోటీల్లో పాల్గొని, ఆకట్టుకునే ముగ్గులను వేయడం ఎంతో ఇష్టం. కలర్ కాంబినేషన్లను ముందుగానే ఎంపిక చేసుకుని, అందరిలో దిబెస్ట్ అనిపించేలా ముగ్గులను వేసేందుకు ఈ పోటీలు ఉపయోగపడుతున్నాయి. – సీహెచ్. ప్రీతి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

న్యూస్‌రీల్

'కంటి వెలుగు' విజయవంతం చేయండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీసీఈవో

భీమిని/భీమారం/నెన్నెల/కోటపల్లి/బెల్లంపల్లి రూరల్/చెన్నూర్‌రూరల్/చెన్నూర్/జైపూర్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంపై మండలకేంద్రాల్లో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. వైద్య సిబ్బంది అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించారు.'కంటి వెలుగు' జరిగే కేంద్రాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. భీమినిలో జెడ్పీ సీఈఓ కాకిరాల నరేందర్, ఇన్‌చార్జి డీపీఓ ఫణీందర్‌రావు, చెన్నూర్‌లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, మండల ప్రత్యేకాధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శులు, మెడికల్ ఆఫీసర్లు, కౌన్సిలర్లు, వైద్యులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే చిన్నయ్యపై ఆరోపణలు అవాస్తవం'

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీపామ్ నిర్వాహకుల మోసాల విషయంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరోపణలు అవాస్తవమని బీఆర్‌ఎస్ బెల్లంపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి రేవెల్లి విజయ్, అధికార ప్రతినిధి కాసర్ల యాదగిరి తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓ ప్రజాప్రతినిధిగా మాత్రమే ఎమ్మెల్యే ఆరిజిన్ డెయిరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారని తెలిపారు. నిర్వాహకుల మోసం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో కేసు నమోదు చేసి న్యాయం చేయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ ప్రతినిధి దామెర కిరణ్, యువజన విభాగం ప్రతినిధి సన్నీబాబు, మోహన్, రామకృష్ణ, దుర్గం సురేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

మందమర్రిరూరల్: పార్టీ శ్రేణులు ప్రజాసమస్యలను తెలుసుకుంటూ సీపీఐ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడాలని, ఓపెన్ కాస్ట్ గనుల్లో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, తదితర సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పార్టీ ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మిట్టపల్లి పౌల్, వనం సత్యనారాయణ, రాజేశం, మల్లయ్య, దినేష్, రాజలింగు తదితరులు ఉన్నారు.

'ఎమ్మెల్యే పీఏ చెబితేనే టోల్ ప్లాజాలో ఉద్యోగాలు'

మందమర్రిరూరల్: మందమర్రి శివారులోని 363జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా వద్ద ఉద్యోగాల నియామకం కోసం ఎమ్మెల్యే పీఏ చెప్పిన వారికే టోల్ ప్లాజా నిర్వాహకులు అవకాశం కల్పిస్తున్నారని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఎంఏ గుణ, జోనల్ మహిళా విభాగం కన్వీనర్ మద్దెల భవాని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. టోల్‌ప్లాజా ప్రారంభించిన రోజునే నిర్వాహకుల నుంచి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి వారి నుంచి హామీ తీసుకున్నామని, వారిచ్చిన హామీని తుంగలో తొక్కి ప్లాజా నిర్వాహకులు ఎమ్మెల్యే పీఏ చెప్పిన వారికే ఉద్యోగ అవకాశం కల్పిస్తామని అనడమేమిటని ప్రశ్నించారు.

శునకాలకు తీవ్రచర్మ రోగం



చెన్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు అంగ్రాజ్‌పల్లి, కత్తెరసాల గ్రామాల్లో శునకాలు చర్మ వ్యాధి బారినపడి మృతి చెందుతున్నాయి. వెంట్రుకలు మొత్తం ఊడిపోయి, చర్మం మొత్తం బయటపడుతూ, దుర్వాసన వెదజల్లుతూ చనిపోతున్నాయి. ఈ వ్యాధి ఒక దాని నుంచి మరో శునకానికి సోకుతుంది. ఈ విషయమై కత్తెరసాల పశువైద్యాధికారిని వివరణ కోరగా ఇది తీవ్ర చర్మ రోగం అని తెలిపారు. ఈ వ్యాధి సోకిన శునకాలను పట్టుకొని తమకు సమాచారం అందిస్తే టీకాలు వేసి వైద్యం అందిస్తామన్నారు.

యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



భీమిని: మాట్లాడుతున్న సీఐ జగదీష్

భీమిని: యువకులు క్రీడలతో పాటు చదువులో రాణించాలని తాండూర్ సీఐ జగదీష్ అన్నారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని ఓడిన వారు నిరుత్సాహపడకుండా విజయం వైపు ముందుకు సాగాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తాండూర్ సర్కిల్ పరిధిలోని మండలాల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫైనల్ మ్యాచ్ తాండూర్ సర్కిల్‌లో నిర్వహించి విజయం సాధించిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్యనారాయణ, ఎస్సైలు సురేష్, వెంకటేష్, మాజీ సర్పంచ్ రాజయ్య, ఉపసర్పంచ్ వెంకటేష్, కో ఆప్షన్ సభ్యుడు అంకూస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

జైపూర్: పల్లెల్లో యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శ్రీరాంపూర్ సీఐ రాజు, ఎస్సై రామృకష్ణ తెలిపారు. మండలంలోని ఇందారం గ్రామంలో స్థానిక సర్పంచ్ గడ్డం మంజులప్రసాద్, వైఎస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, ఇందారం–2 ఎంపీటీసీ ఆర్కే స్వర్ణసంతోశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ తండ్రి కీర్తిశేషులు బాల్క సురేశ్ స్మారకార్థం శుక్రవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ పోటీలను సీఐ రాజు, ఎస్సై రామకృష్ణ ప్రారంభించారు.

వేమనపల్లి: మండలంలోని బుయ్యారంలో కిష్టాగౌడ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతగా దహెగాం మండలం అత్తిని టీమ్ విజేతగా నిలిచింది. రన్నర్‌ప్‌గా బుయ్యారం టీమ్ నిలిచింది. ప్రైజ్‌మణీ, ట్రోఫీని వైస్ ఎంపీపీ గణపతి, సర్పంచ్ శ్రీనివాస్ విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు మల్లేష్ నేత, రవి, శ్రీను పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీడీవో

జైపూర్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఆర్‌డీవో శేషాద్రి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమం నిర్వహించగా, పలు వీధుల్లో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ సువర్ణ, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్, ఏపీవో బాలయ్య, కార్యదర్శి ఉదయ్, బిల్‌కలెక్టర్ మల్లేశ్, వార్డుసభ్యులు ఉన్నారు.

కోటపల్లి: ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్కసుమన్ ఆదేశాల మేరకు చెన్నూర్ 5 మండలాల్లో ఉన్న గ్రామ పంచాయతీలను ఉత్తమ గ్రామపంచాయితీలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో స్వచ్ఛ శుక్రవారం ప్రవేశపెట్టారని సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ తిరుపతి తెలిపారు. గ్రామంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొనేలా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని ఏటా గోదారంగనాథుల కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు దామెర మోహనా చార్యులు తెలిపారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అండర్-15 సైకిల్ రేస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల స్థాయిలో 15వ తేదీ ఆదివారం 'యువరాజ్యం స్వచ్ఛంధ సంస్థ' ఆధ్వర్యంలో అండర్–15 సైకిల్ రేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 15సంవత్సరాలలోపు పిల్లలు సైకిల్ రేస్‌ల్లో పాల్గొనేందుకు అర్హులని ఇందుకు ఆధార్‌కార్డుతో పాటు సొంత సైకిల్‌తో పోటీలకు హాజరుకావాలని తెలిపారు. మొదటి విజేతకు రూ.3వేలు, రెండో విజేతకు రూ.2వేలు, మూడో విజేతకు రూ.వెయ్యి నగదు బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9676172580, 9948543085, 9441536565కు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

జీవో 58 పట్టాల పంపిణీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నస్పూరు మున్సిపాలిటీ పరిధిలో జీవో 58 కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో రెగ్యులరైజేషన్ పట్టాలను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పంపిణీ చేశారు. జీవో 58 కింద 125చదరపు గజాల కంటే తక్కువగా ఉండి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందే ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకున్న వారిలో మంచిర్యాలలో 35, నస్పూరులో 17మందికి ఈ పట్టాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ రాజేశ్వర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



తాండూర్: బహుమతి అందిస్తున్న ఆర్డీవో



ముగ్గులు వేస్తున్న మహిళలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

అలరించిన ముగ్గుల పోటీలు

మంచిర్యాలఅర్బన్/దండేపల్లి/మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్/జన్నారం: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ముగ్గుల పోటీల విజేతలకు ఎమ్మెల్యే దివాకర్‌రావు బహుమతులు అందజేశారు. దండేపల్లి మండలం రెబ్బనపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ బహుమతులు అందించారు. తాండూర్‌లో ఆర్డీవో శ్యామల దేవి ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. జన్నారం మండలంలోని స్లేట్ హైస్కూల్ దత్తత గ్రామమైన కొత్తపేట్ గ్రామ పంచాయతీలోని కొలాంగూడ ఆదివాసీ గిరిజన గ్రామంలో ఆరో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



జన్నారం: భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

ఆర్కే-7గనిపై గేట్‌మీటింగ్



ఆర్‌కే7 గనిపై మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

నస్పూర్: సింగరేణి కార్మికుల శ్రేయస్సు కోసం కోల్ ఇండియాలో లేని హక్కులు సాధించామని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆర్‌కే 7గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐటీయూసీ నాయకులు తమపై చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని మానుకోవాలని సూచించారు. సమావేశంలో గని ఫిట్ సెక్రటరీ మెండె వెంకటి, జీఎం చర్చల ప్రతినిధి వెంగళకుమారస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు భూపతి అశోక్, నాయకులు ల్యాగల శ్రీనివాస్, రమేశ్, చిలువేరు సదానందం, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నస్పూర్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సీసీసీ సింగరేణి పాఠశాలలో విద్యార్థులకు 'ఇందనపొదుపు' అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయురాలు అనురాధ బహుమతులు అందజేశారు.

బొగ్గుబాయి వార్తలు

'ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి'

నస్పూర్: సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌తో సహా అన్ని సంఘాలు కలిసి ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ వేజ్‌బోర్డు మెంబర్ మంద నర్సింహారావు కోరారు. ఆర్‌కే న్యూటెక్ గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ వేజ్‌బోర్డు అమలుపై జాతీయ సంఘాలు సమ్మెకు సిద్ధమవుతున్నాయనే భయంతో యాజమాన్యం వేజ్ బోర్డు 19శాతం అమలుకు ఒప్పందం చేసుకుందని తెలిపారు. గుర్తింపు సంఘం నాయకులు జాతీయ సంఘాలపై విమర్శలు చేయకుండా, సింగరేణి యాజమాన్యాన్ని ఒప్పించి అలవెన్సులపై ఐటీ మాఫీ చేయించాలని డిమాండ్ చేశారు. గనుల్లో ప్రైవేటు ఎస్‌డీఎల్ యంత్రాలను వినియోగించకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి భాగ్యరాజు, డివిజన్ ఆర్గనైజర్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్, ఫిట్ సెక్రటరీ అజయ్, నాయకులు వెంగళ శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్వామి వివేకానంద యూత్ అవార్డు

చెన్నూర్‌రూరల్: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా చెన్నూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సదావరి సాయితేజకు స్వామి వివేకానంద యూత్ అవార్డును కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో అందజేశారు.

అభివృద్ధి పనుల ఎంపిక

లక్సెట్టిపేట/వేమనపల్లి/భీమారం: గ్రామపంచాయతీల్లో 2023–24లో చేపట్టాల్సిన పనుల ఎంపికకు గ్రామసభలు నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానించారు. భీమారం మండలం కాజిపల్లిలో ఎంపీడీవో శ్రీనివాస్, లక్సెట్టిపేట మండలం జెండావెంకటాపూర్‌లో ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, వేమనపల్లి మండలం నీల్వాయిలో సర్పంచ్ గాలి మధు, ఎంపీవోలు,ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బులు, నూనె డబ్బాలు పంపిణీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య సబ్బులు, నూనె డబ్బాలు, బెల్లం పంపిణీ చేశారు.

సాదాసీదాగా మండల సభ

నెన్నెల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. కోరం లేక సమావేశం గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. 24అంశాలపై చర్చించాల్సి ఉండగా 15అంశాలపైనే చర్చ కొనసాగింది. అధికారులు మొక్కుబడిగా తమ ఎజెండాను చదివి వినిపించారు. మరికొందరు తమ వంతు అయిపోగానే సమావేశం నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సింగతి శ్యామల, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఓ నరేష్, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ, డెప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు తిరుపతి, సుమలత, కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 7,8 వ వార్డులకు చెందిన పలువురు మహిళలు శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.